# 20వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

ఈ ప్రపంచమున అది ఆధ్యాత్మిక వాతావరణమును సృష్టిస్తుంది. పవిత్ర నామాలను జపించడం భౌతిక వాంఛల కోసం అర్రులు చాచడం, అసూయ మరియు కలవరం లేనటువంటి వైకుంఠ వాతావరణాన్ని ప్రేరేపిస్తుంది. ఎప్పుడైతే దివ్యమైన పదముల యొక్క శుద్ధమైన విషయములు చర్చకు వచ్చునో అప్పుడు కనీసం వాటిని చర్చించే సమయమునైనా సరే సభ్యులు అన్ని రకములైన భౌతికమైన వాంఛలను మరచిపోవుదురు. అంతే కాకుండా వారు ఒకరి మీద మరొకరు అసూయ చెందరు మరియు కలవరం, భయముల నుండి బాధ పడరు.

వైకుంఠం అనగా "కలవరం లేని" మరియు భౌతిక ప్రపంచము అనగా కలవరముతో కూడియున్నది అని అర్థము. ప్రహ్లాద మహారాజ చెప్పినట్లు: "సదా సముద్విగ్న-ధియం అసద్-గ్రహాత్". ఈ భౌతిక ప్రపంచమును వారి నివాస స్థలముగా అంగీకరించిన జీవులు పూర్తిగా కలవరములతో ఉందురు. ఎప్పుడైతే శుద్ధ భక్తులు దేవదేవుని యొక్క పవిత్ర విషయములను చర్చించెదరో అప్పుడు ఆ స్థలం వెంటనే వైకుంఠముగా మారిపోతుంది. శ్రవణం, కీర్తన విష్ణో (శ్రీమద్భాగవతం 7-5-23) అను విధానము ఇదే, దేవదేవుడు విష్ణువును గూర్చి జపించడం మరియు వినడం.

*నాహం తిష్ఠామి వైకుంఠే*
*యోగినాం హృదయేషు వ*
*తత్ర తిష్ఠామి నారద*
*యత్ర గాయంతి మద్భక్తః*

అని దేవదేవుడు చెప్పినట్లు.

దివ్యమైన ప్రకంపనముల రూపమున దేవదేవుడు ప్రత్యక్షముగా ఉండడం వలన వైకుంఠ వాతావరణము నెలకొల్పబడి ఉంటుంది. ఇది కలవరము మరియు భయము లేనటువంటి వాతావరణము. ఒక జీవి మరొక జీవి వలన భయపడక్కరలేదు. దేవుని పవిత్ర నామములను మరియు కీర్తిని వినడం వలన వ్యక్తి పుణ్యకార్యములు నిర్వహించును. శృణ్ వతాం-స్వకథః కృష్ణః పుణ్య శ్రవణ కీర్తనం (శ్రీమద్భాగవతం 1:2-17) ఆ విధంగా భౌతిక వాంఛల వెనుక పరుగు పెట్టడం వెంటనే ఆగిపోతుంది. ఈ భౌతిక ప్రపంచమునే కలవరములు లేనటువంటి దివ్య ప్రపంచమును, వైకుంఠమును సృష్టించుటకు కృష్ణ చైతన్య సంస్థ ఈ సంకీర్తనోద్యమము మొదలు పెట్టినది. ప్రపంచమంతట శ్రవణం, కీర్తనం పద్ధతిని ప్రాకేట్లు చేయడమే ఈ విధానము. ఈ భౌతిక ప్రపంచమున ప్రతీ వ్యక్తి తోటి వ్యక్తిపై అసూయ పడుతున్నవాడే. "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అను పవిత్ర నామములను జపిస్తూ సంకీర్తనా యజ్ఞమును నిర్వహించకుండా ఉన్నంత కాలం పశుప్రవృత్తి అయిన అసూయ మానవ సంఘమునందు కొనసాగుతూనే ఉంటుంది.

మన జపమును కొనసాగించుటకు శ్రీల ప్రభుపాదుల వారి జపమును వింటూ ఉండవచ్చును. ఆ విధంగా జపం చేసేటప్పుడు ఎక్కువ ఏకాగ్రత మరియు ఆధ్యాత్మిక శక్తి ఉండవచ్చును. చాలా మంది ఇంటి దగ్గర నాలుగు మాలలు చేసేవారు అవ్వడం వల్లన వారు ఏకాగ్రత చూపించడం కష్టమవ్వచ్చును. శ్రీల ప్రభుపాదుల వారితో జపించడం వలన వారు జపించే అభిరుచిని పొందగలరు.

## చర్చ - విషయ విభాగము

## ఆధ్యాత్మిక విద్య

*పత్రం పుష్పం ఫలం తోయం*
*యో మె భక్త్యా ప్రయచ్ఛతి*
*తదహం భక్త్యుపహృతం*
*అశ్నామే ప్రయతాత్మనః*

"ఎవరైనను నాకు ప్రేమతోడను, భక్తితోడను ఆకును గాని, పువ్వును గాని, పండును గాని, నీటిని గాని అర్పించినచో దానిని నేను స్వీకరించెదను."

నిత్య సౌఖ్యమునకై శాశ్వతమును, ఆనందకరమును అయిన భగవద్ధామమును పొందుటకై దివ్యప్రేమయుక్తమైన భగవత్సేవలో నిమగ్నుడై కృష్ణ చైతన్యముతో కూడియుండుట బుద్ధిమంతునికి చాలా ముఖ్యము. అటువంటి అద్భుతమైన ఫలితమును సాధించుట చాలా శులభము మరియు ఏవిధమైన అర్హత లేని పరమ దరిద్రునికి కూడ ప్రయత్నసాధ్యము. ఈ సందర్భమున కావలసిన ఒకే ఒక్క అర్హత భగవంతుని విశుద్ధ భక్తునిగా ఉండడం. మానవుడు ఎక్కడ ఉన్నాడు, ఎటువంటి వాడు అను దానికి దీనితో సంబంధము లేదు. నిజమైన ప్రేమతో దేవదేవునికి పత్రమును గాని, స్వల్పజలమును గాని, ఫలమును గాని అర్పింపవచ్చును. భగవంతుడు దానిని సంతోషముతో అంగీకరించును. అందుచే చాల సులభమును విశ్వజనీనమును అగుటచే కృష్ణ చైతన్యమును పొందుటకెవ్వరికిని నిషేధము లేదు. ఈ సులభమైన మార్గముచే కృష్ణ చైతన్యమును పొంది శాశ్వత ఆనందజ్ఞాన మయమైన సంపూర్ణ జీవితము కాంక్షింపని అజ్ఞానుడు ఎవడుండును? కృష్ణుడు ప్రేమయుక్తమైన సేవనే తప్ప మరేదియు కోరడు. అతడు తన విశుద్ధభక్తుడిచ్చు స్వల్పకుసుమమునైనను అంగీకరించును. భక్తుడు కాని వాని నుండి అతడెట్టి కానుకను కోరడు. స్వయం సంపూర్ణుడగటచే అతడు ఎవ్వరి నుండి ఏదియు కోరవలసిన అక్కరలేదు. అయినను ప్రేమానురాగ భక్తి భావముతో తన భక్తులొసంగు కానుకలను అంగీకరించును. కృష్ణ చైతన్యమును వృద్ధిచేసికొనుట జీవితమునందలి అత్యున్నత పరిపక్వ స్థితి. "భక్తి" లేక భక్తియుక్త సేవయే కృష్ణుని పొందుటకు ఏకైక మార్గమని నొక్కి చెప్పటకై ఈ శ్లోకమున "భక్తి"యును పదము రెండు మారులు వాడబడినది. బ్రాహ్మణుడగుట, విద్వాంసుడగుట, ధనికుడగుట లేక పెద్ద వేదాంతియగుట మున్నగు ఇతర స్థితులేవియు, కృష్ణునిచే కానుకలను అంగీకరింపచేయలేవు. మూల సిద్ధాంతమైన భక్తి లేకుండా ఎవ్వరు కాని దేనిని కాని కృష్ణునిచే అంగీకరింపచేయలేవు. భక్తి ఎప్పడు కారణముతో (కోరికతో) కూడియుండునది కాదు. అది పరిపూర్ణత్వమునకు ప్రత్యక్ష సేవాకార్యరూపమైనట్టిది.

ఇచ్చట కృష్ణుడు తానే ఆదిదేవుడును, ఏకైక భోక్తయు, అన్ని యజ్ఞసమర్పణములకును పరమావధియు అని నిశ్చయించి తనకెట్టి యజ్ఞాచరణములను సమర్పింపవలెనో ప్రకటించుచున్నాడు. ఎవరైతే దేవదేవుని యందు భక్తియుత సేవలో నిమగ్నులగుట ద్వారా తమ ఉనికిని పవిత్రీకరించుకోదలచుకొన్నారో మరియు జీవిత లక్ష్యాన్ని అనగా భగవంతునియందు దివ్య ప్రేమయుక్తమైన సేవను సాధించగోరుచున్నారో వారు భగవంతుడు తన నుండి ఏమి కోరుకొనునో తెలుసుకోవాలి. కృష్ణుని ప్రేమించువాడు అతడేమి కోరునో దానిని ఇచ్చుచు, అవాంఛనీయమైన ఎట్టి

కానుకను కృష్ణునకు అర్పింపడు. ఈవిధంగా మాంసము, మత్స్యములు, గ్రుడ్లు, కృష్ణునికి సమర్పింపరాదు. అతడట్టి వస్తువులను కానుకలుగా వాంఛించినచో అట్లు చెప్పియుండెడివాడు. అట్లు చెప్పక పత్రముగాని, ఫలముగాని, జలముగాని, తనకు అర్పింపవలెనని అతడు స్పష్టముగా కోరుచు "ఇట్టి కానుకను నేనంగీకరింతు"నని చెప్పుచున్నాడు. అందుచే అతడు మాంసమును, చేపలను, గ్రుడ్లను అంగీకరింపడని మనము అర్థము చేసికొనవలెను. కూరలు, ధాన్యము, పండ్లు, జలము, పాలు అనునవి మానవునికి తగిన ఆహారముగా కృష్ణభగవానునిచేతనే నిర్దేశింపబడిన పదార్థములు. మనము తిను ఇతర పదార్థములన్నియు అంగీకరింపడు; కావున అతనికి సమర్పింపరాదు. అట్టి ఆహారములను సమర్పించినచో మనము ప్రేమయుక్త భక్తిస్థితిలో వ్యవహరించువారము కాకపోవుదుము.

తృతీయాధ్యాయమునందలి పదుమూడవ శ్లోకములో: "యజ్ఞశేష పదార్థములే పరిశుద్ధములైనవనియు, జీవితమున అభివృద్ధిని, భౌతిక బంధముల నుండి విముక్తిని కోరువారికి తినుటకు తగినవనియు" అని కృష్ణుడు వివరించియున్నాడు. ఆ శ్లోకములోనే తాము తిను పదార్థములను తనకు నివేదింపనిచో వారు పాపమునే తిందురని అతడు చెప్పుచున్నాడు. అనగా వారు తిను ప్రతి ముద్ద భౌతిక ప్రకృతి పదార్థములను సిద్ధముచేసి, కృష్ణభగవానుని పటమునకుగాని, అతని విగ్రహమునకు నివేదించి, అతని యందు నమ్రుడై అట్టి స్వల్పమైన కానుకను గ్రహింపుమని కోరువానిని, అది జీవితమునందు క్రమముగా అభివృద్ధి పొందుటకు, దేహమును పరిశుద్ధపరచుటకును, స్పష్టమైన ఆలోచనలకు దారిచూపు మేధానాడులను పెంపొందించుకొనుటకును సమర్థునిగ నొనరించును. అన్నిటి కన్న మిన్నగా ఆ కానుకను ప్రేమతో కూడిన మనఃప్రవృత్తితో నర్పింపవలయును. ఉన్నదంతయు కృష్ణునిదే అగుటచే అతనికి ఆహారము కావలసని అవసరము లేదు. అయినను తన్నావిధముగా ప్రీతి నొందించుటకు కోరువాని కానుక నతడంగీకరించును. ఆహారము సిద్ధముచేయుట, వడ్డించుట, నివేదించుట అను వానిలో కృష్ణునియెడ ప్రేమతో వర్తించుట ముఖ్యమైన విషయము.

పరమసత్యము, ఇంద్రియ రహితమని తలంచు నిరాకారవాదులు, భగవద్గీతయందలి ఈ శ్లోకము నర్థముచేసికొనజాలరు. వారికిది అలంకార ప్రాయముగానో భగవద్గీతను బోధించు కృష్ణుని భౌతిక ప్రవృత్తికి నిదర్శనముగానో కనిపించును. కాని నిజమునకు దేవదేవుడైన కృష్ణునికి ఇంద్రియములు కలవు. ఆ ఇంద్రియములు, అంతఃపరివర్తన క్షమములని అనగా ఒక ఇంద్రియము మరియే ఇంద్రియముల పనినైన చేయగలదని చెప్పబడినది. కృష్ణుడు పరిపూర్ణుడని చెప్పటయే దీని అర్థము. ఇంద్రియములు లేనిచో అతనిని సర్వవైభవోపేతుడని పరిగణించుటకు వీలులేదు. సప్తమాధ్యాయము నందు తాను జీవులను భౌతిక ప్రవృతియందు పుట్టించెనని కృష్ణుడు చెప్పెను. అతడు భౌతిక ప్రకృతిని చూచుటచేతనే అది జరుగును. ఈ సందర్భమున **ఆహార పదార్థములను అర్పించుచు భక్తులు పలుకు ప్రేమపూర్వకమైన మాటలను కృష్ణుడు వినుటయే అతడు వానిని తిని ఆస్వాదించుటతో పూర్తిగా సమానము. ఈ విషయమును నొక్కిచెప్పవలసియున్నది:** అతడు పరిపూర్ణ స్థితిలో నుండుటచే అతని శ్రవణము భక్షణాస్వాదనములతో పూర్తిగా సమానము. కృష్ణుని అతడు తనను వర్ణించుకొనినట్లు, సొంత వ్యాఖ్యానము లేకుండా అంగీకరించు భక్తుడే పరమ సత్య స్వరూపుడు ఆహారమును తినగలడనియు, అనుభవింపగలడనియు అర్థము చేసికొనగలడు.

**కనుగొనండి :**

1. నిజమైన బుద్ధిమంతులు కృష్ణ చైతన్యులుగా కావలెనని ఎందుకు కోరుకుందురు?
2. దీనిని సాధించుటకు అవసరమైన అర్హత ఏమిటి?

**అవగాహన :**

1. కృష్ణుడు మనలను తనకు ఆహారమును ఎందుకు సమర్పించవలెనని కోరుకొనును?
2. ఎవరి నుండి అతడు ఆహార పదార్థములను అంగీకరించును?
3. అతడు మనలను వేటిని నివేదించమనును?
4. కృష్ణునికి ఆహారమును సమర్పించి దానిని మనము తినుట వలన మనకు కలుగు ఆధ్యాత్మిక లాభములు ఏమిటి?
5. నిరాకారవాదులు భగవంతుడు ఎందుకు తినలేడని భావించెదరు? కృష్ణుని యొక్క ఇంద్రియాల ప్రత్యేకత ఏమిటి?
6. భక్తుడు ప్రేమతో ఆహార పదార్థములను సమర్పిస్తూ చెప్ప మాటలను కృష్ణుడు వినడం, సమర్పించిన ఆహారమును తినడం, రుచిచూడడంతో ఏ విధంగా సమానమగునో వివరించండి?

**అనువర్తనము :**

1. ప్రసాదము మరియు ప్రసాదము కాని ఆహార పదార్థముల మధ్య తేడాను చర్చించండి.

## ప్రచారమే సర్వసారము

పూజ్యనీయులు ఎ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు రచించిన "ప్రచారం చేయడమే సారాంశము" నుండి సంగ్రహించబడింది.

"భగవంతుని యొక్క ఉద్దేశ్యమును గ్రహించి భక్తుడు ప్రచారం చేయును".

భౌతిక ప్రకృతి యొక్క మూడు గుణములచే దిక్కుతోచని అజ్ఞానులు భౌతిక కార్యక్రమముల యందు పూర్తిగా నిమగ్నులై వాటికి బంధీలగుదురు. అట్టివారు అజ్ఞానముచే చేయు కార్యక్రమములు అల్పమైనప్పటికీ జ్ఞానవంతుడు వారిని కలత పెట్టరాదు. అజ్ఞానులైన మనుష్యులు కృష్ణ చైతన్యములో చేసే పనులను మెచ్చుకొనలేరు. అందుకని వారిని కలవరపరచి మన సమయమును వృధా చేసుకొనరాదని కృష్ణుడు ఉపదేశించుచున్నాడు. భగవంతుని యొక్క ఉద్దేశ్యమును అర్థం చేసుకొన్న వారవడం వలన భగవద్భక్తులు భగవంతునికన్న దయ కలవారు. తత్ఫలితముగా అజ్ఞానులను చేరి వారిని కృష్ణచైతన్యపు పనులలో నిమగ్నులను చేయుటకు ప్రయత్నించడంలో సహభక్తులు అన్నీ రకముల అపాయములను అంగీకరింతురు. ఇది పూర్తిగా మానవులకు అవసరము.

***భగవద్గీత యథాతథం 3:29***

## 21వ వారము - సభ్యుల విభాగము

## నామామృతం

"అది మనకు శాంతిని చేకూరుస్తుంది."

ప్రపంచ శాంతికి సూత్రం ఏమిటంటే భగవన్నామాలను జపించడం వంటి శులభ పద్ధతి ద్వారా కృష్ణ చైతన్యమును వృద్ధి చేయడం.

ఈ భూమి భగవంతుని సొత్తు. కాని జీవులు ప్రత్యేకించి నాగరికతను సాధించామనుకొనే మానవులు భగవంతుని సొత్తును తమదిగా చెప్పకొనుచున్నారు. వీరు వ్యక్తిగతంగా మరియు సామూహికంగా తప్పడు భావనలో ఉన్నారు. మీరు శాంతిని నెలకొల్పవలెనంటే ఈ రకమైన తప్పడు భావనను మీ మనస్సు నుండి మరియు ప్రపంచము నుండి పారద్రోలవలెను. మానవ జాతి యందు ఈవిధమైన తప్పడు యాజమాన్య భావం భూమిమీద శాంతి యొక్క అసమానతలన్నిటికీ పాక్షికంగా గాని లేదా పూర్తిగా గాని కారణము.

మూర్ఖులు మరియు నాగరికతను సాధించామనుకొనే మనుషులు భగవంతుడు లేడనుకునే విధంగా ఉండడం వల్ల భగవంతుని ఆస్తులపైన తమకు యాజమాన్యపు హక్కులు ఉన్నవని చెప్పచున్నారు. భగవంతుడు లేని సంఘమున మీరు శాంతియుతంగా మరియు సంతోషముగా ఉండలేరు. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు అన్ని జీవులకు మంచిన కోరుకునే స్నేహితుడు తానే అని చెప్పెను. ఎప్పడైతే ప్రజలు దీనిని శాంతికి సూత్రముగా తెలుసుకొందురో అప్పటికప్పడే శాంతి స్థాపిత మవుతుంది.

అందువలన మీరు శాంతిని పొందాలనుకొన్న యెడల మీ చైతన్యమును వ్యక్తిగతంగాను మరియు సామూహికంగాను భగవంతుని పవిత్రనామములను జపించు సరళమైన పద్ధతి ద్వారా కృష్ణ చైతన్యముగా మార్చుకొనవలెను. ప్రపంచముల యందు శాంతిని సాధించుట కొరకు ఇది ప్రామాణికమైన మరియు గుర్తింపబడిన పద్ధతి. అందువలన ప్రపంచమున శాంతిని సాధించుట కొరకు మేము ఈ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాము. అందువలన "హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే / హరే రామ హరే రామ రామ రామ హరే హరే" అని జపించుట ద్వారా మీరు కృష్ణచైతన్యులుగా మారండని మేము ప్రోత్సహిస్తున్నాము.

ఇది చాలా అభ్యాసయోగ్యమైనది, సరళమైనది మరియు పవిత్రమైనది. 480 సంవత్సరముల క్రితం శ్రీ చైతన్య దేవునిచే భారతదేశమునందు ఈ సూత్రము పరిచయము చేయబడింది. ఇప్పడు ఇది మీ దేశమున లభిస్తున్నది. పైన చెప్పబడిన సరళమైన ఈ జపించు పద్ధతిని గ్రహించండి. మీ నిజమైన స్థానమును భగవద్గీత యథాతథమును చదువుట ద్వారా తెలుసుకోండి. మరియు పోగొట్టుకున్న కృష్ణునికి మీకు గల సంబంధమును పునఃస్థాపితము చేయండి. వెనువెంటనే ప్రపంచము మొత్తమున శాంతి మరియు అభివృద్ధులు నెలకొండును.

*పంచతత్త్వ మంత్రమును జపించి తరువాత ఒక మాల జపాన్ని అనుసరించండి. శ్రీల ప్రభుపాదుల వారి జపాన్ని వెనుకగా ప్లే చేయండి. ఇది నిష్ఠతో, ప్రేరణాభావంతో జపం చేసేటట్లు ఆధ్యాత్మిక వాతావరణమును సృష్టిస్తుంది.*